ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

మంగళవారం 14 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 32.0

కనిష్ఠం : 24.0



రహదారులు ఛిద్రం

జిల్లాలో రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. వర్షాలతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఈ రోడ్లపై వాహన రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక శాతం రోడ్లను తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణంలో బిల్లుల చెల్లింపులో జాప్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. కుక్కునూరు - అశ్వారావు పేట ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గోతులతో నరకప్రాయంగా మారింది.

■ లోపలి పేజీలో..



సంక్షామం

జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్‌లో సమస్యలు తిష్ట వేశాయి. దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం కలగడం లేదు. కూటమి ప్రభుత్వం టాయిలెట్లు, గదుల మరమ్మతుల పైనే దృష్టి పెట్టింది. విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల 'ఆంధ్రజ్యోతి' బృందం సోమవారం హాస్టళ్లను పరిశీలించింది.

■ లోపలి పేజీలో..



కమనీయం..కల్యాణం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయ పురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. సోమవారం స్వామివారి కల్యాణం రమణీయంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్చరణలు, కళాకారుల ప్రదర్శనలు, భక్తుల గోవింద నామస్మరణతో వాడపల్లి మార్మోగుతోంది.

జేసీగా అభిషేక్ గౌడ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ వెట్రిసెల్వికి పూల మొక్కను ఇస్తున్న జేసీ అభిషేక్ గౌడ

ఏలూరు,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ కలెక్టరేట్‌లో సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జేసీగా పని చేస్తూ ఈయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ నూతన జేసీకి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో పౌరసరఫ రాల వ్యవస్థ పటిష్టవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం ఆమెతో పాటు పీజీఆర్ఎస్‌లో వినతులను స్వీకరించారు. తొలుత జేసీకి డీఆర్వో విశ్వేశ్వర రావు, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్‌లు స్వాగతం పలికారు.

26 నుంచి పంచారామాలకు బస్సులు

- జిల్లా వ్యాప్తంగా ఒకే టిక్కెటు ధర..డీపీటీవో షేక్ షబ్నం

ఏలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఏలూరు జిల్లా నుంచి పంచారామాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను ఈ నెల 26 నుంచి నడిపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు డీపీటీవో షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, నవంబరు 2,9,16 తేదీల్లో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ఆదివారం రాత్రులు 8 గంటల నుంచి బస్సులు బయల్దేరి తిరిగి సోమవారం రాత్రికి గమ్యస్థానాలకు చేరతాయి. జిల్లా వ్యాప్తంగా ఒకే టిక్కెటు ధర నిర్ణయించారు. ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్ రూ.1100, సూపర్ లగ్జరీ రూ.1200లుగా నిర్ణయిం చారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని, ఒకే గ్రామం నుంచి 40 మంది ఉన్నచోట్ల డిపో మేనేజర్‌ను సంప్రదిస్తే ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తామన్నారు. శబరిమలైకు వెళ్లి వచ్చేందుకు నాలుగు రోజులకు రూ.4,500, ఆరు రోజు లకు 5,500లతో ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకువచ్చా మన్నారు. కార్తీక మాసం ప్రతీ శనివారం, ఆదివారం రాత్రి 8 గంటలకు శ్రీశైలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు అన్ని డిపోల నుంచి ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఏలూరు డిపో నెంబర్ 63038 59484, జంగా రెడ్డిగూడెం-94929 49350, నూజివీడు- 99592 25461, మార్కెటింగ్ సెల్ నెంబర్ 93467 67670లో సంప్రదించాలని డీపీటీవో సూచించారు.

కుండపోత!



నీట మునిగిన ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఆర్ఆర్‌పేటకు వెళ్లే రోడ్డు

- భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం
- ఏలూరు నగరం జలమయం
- కొయ్యలగూడెంలో 8 గంటల్లో 91.4 మి.మీ వర్షపాతం
- రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు.. ఆరెంజ్ అలర్ట్ జారీ

ఏలూరుసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రభావంతో జిల్లాలో కుండ పోతగా వర్షం కురిసింది. సోమవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన వర్షం సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరపిలేకుండా కురి సింది. జిల్లాలో జనజీవనం స్తంభించింది.



పత్తేబాద రైతు బజారు వద్ద రోడ్లపై మురుగునీరు

ఏలూరు జలమయం

ఏలూరు నగరంలో పవర్‌పేట రైల్వే స్టేషన్‌వద్ద, శ్రీనివాసా థియేటర్ సెంటర్‌లో లోలెవల్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. లోలెవల్ బ్రిడ్జిని మూసివేయడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కొత్తపేటలో మురుగుకాలువ నీరు రహదారులపై ప్రవహించింది. పత్తేబాద రైతుబజారు రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించింది. డ్రెయినేజీల నీరు రహదారుల పైకి చేరడంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం నెలకొని ఉంది.

ఎనిమిది గంటల్లోనే 91.4 మి.మీ వర్షపాతం

గత 24 గంటల్లో (ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు) జిల్లాలో అత్యధికంగా కైకలూరు మండలం లో 87.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 13.9 మి.మీగా నమోదైంది. అయితే సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దాదాపు 8 గంటల్లోనే జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో

(మిగతా 8వ పేజీలో)



నీట మునిగిన ఆసుపత్రి ఓపీ విభాగాలు

ఏలూరు క్రైం : సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి అకస్మాత్తుగా ప్రారంభమైన వర్షం మూడు గంటల పాటు ఎడతెరపి లేకుండా భారీగా కురవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణ, ఓపీ విభాగాలు నీటమునిగాయి. రోగుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. యుద్ధ ప్రాతిపదికన మోటర్లతో పారిశుధ్య కార్మికులు నీటిని తోడించారు. ఆసుపత్రి ముందు ఉన్న ఆర్ఆర్‌పేట రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై సిమెంటు దిమ్మలు లేకపోవడంతో ఫుట్‌పాత్‌లు నీటమునిగిపోయాయి. ఫుట్‌పాత్‌లు ఉన్నాయని నడుస్తున్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలయ్యారు. అయితే అక్కడే ఉన్నవారు చూసి వెంటనే వారిని కాపాడారు. ఆర్ఆర్‌పేట రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో సెయింట్ థెరిస్సా హైస్కూలు, ఎలిమెంటరీ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫుట్‌పాత్‌లపై విరిగిపోయిన సిమెంటు దిమ్మలస్థానే కొత్త వాటిని ఏర్పాటు చేసి తమ పిల్లల ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

రోడ్లన్నీ జలమయం.. ట్రాఫిక్‌కు అంతరాయం

కొయ్యలగూడెం/పెదవేగి/పోలవరం/బుట్టాయగూడెం/ ద్వారకా తిరుమల/జీలుగుమిల్లి/: కొయ్యల గూడెంలో భారీవర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి 11గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్ని జలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లే రహదారిలో స్థానిక అపోలో పాఠశాల వద్ద రోడ్డు పై నుంచి వర్షపునీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు. కన్నాపురం రోడ్డులో షాపుల్లోకి వరదనీరు చేరింది. కన్నాపురం పడమటి, తూర్పుకాల్వ ఉధృతంగా ప్రవహించడంతో పోలవరం వెళ్లే వాహనాలన్ని తాళ్లపూడి మీదుగా పయనించాయి. పెదవేగి మండలంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం రహదారు లను కాలువలుగా మార్చేసింది. పంటపొలాలను ముంచెత్తింది. పోలవరం మండల కేంద్రంలో బెస్తావీధి,ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, మెయిన్ బజార్ బాపూజీ కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. కొవ్వాడ కాలువ, గుంజవరం కాలువలు, కొండవాగుల జలాలు ఉధృతంగా ప్రవహించి పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. మరోవైపు కడెమ్మ కాలువ జలాలు కడమ్మ స్లూయజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహించాయి. బుట్టాయగూడెం ఏజెన్సీ ప్రాంతంలో ఉరుములు మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్ని వర్షపునీటితో బురదగా మారాయి. ద్వారకాతిరుమలలో వర్షం వల్ల క్షేత్రానికి వచ్చిన భక్తులు, స్థానికులు ఇబ్బందుల పాలయ్యారు. ఆలయంలో భక్తుల రద్దీ కాస్త తగ్గింది. జీలుగుమిల్లిలో కురిసిన భారీవర్షం కారణంగా పొగాకు నారు మడులు కొంతమేరకు పాడవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కొయ్యలగూడెంలో అపోలో పాఠశాల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



నిడమర్రు మండలంలో వివిధ పాఠశాలలో విధులలో చేరే నూతన ఉపాధ్యాయుల బృందంతో ఎంఈవోలు అనూరాధ, శేషగిరిరావు

కొత్త టీచర్లు వచ్చారు..

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

864 మందికి 16 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి జిల్లా నుంచి ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం సంబంధిత పాఠశాలల్లో విధులు చేపట్టారు. నియామకాలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరుగగా, పాఠశాలలకు కేటాయింపులు మాత్రం కొత్త జిల్లాలను ప్రామాణికంగా తీసుకుని చేశారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాకు మొత్తం 864 మంది కొత్త టీచర్లను కేటాయించగా, వీరిలో 16 మంది మినహా, మిగతా వారంతా ఆయా పాఠశాలల్లో రిపోర్టు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలా ల్లోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకపోవడంవల్ల కొందరు ఉపాధ్యాయులు తొలిరోజున ముఖగుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్)ను నమోదు చేయలేకపోయారు. కాగా కొత్తగా నియామకాలు పొందిన టీచర్లు నిబంధనల ప్రకారం 30 రోజుల్లోగా విధుల్లో చేరవచ్చు.

క్లస్టర్ స్కూల్స్‌కు మున్సిపల్ టీచర్లు!

ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలలకు ఎంపికైన 43 మంది కొత్త టీచర్లు విధుల్లో చేరినప్పటికీ రెగ్యులర్‌గా పాఠశాలల్లో బోధించేందుకు అవకాశం లేకపోవడంతో వారిని ఇప్పటికేవున్న సర్‌ప్లస్/క్లస్టర్ టీచర్లుగా గుర్తించి నగరంలోని సుబ్బమ్మదేవి, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూళ్లకు క్లస్టర్ టీచర్లుగా నియమించాల్సి వచ్చింది. ఇలా క్లస్టర్ టీచర్లుగా గుర్తించిన కొత్త టీచర్లలో 36 మంది ఎస్టీటీలు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల పాఠశాలలకు నియమితులైన 121 మంది కొత్త టీచర్లను కూడా స్థానికంగా వున్న క్లస్టర్ పాఠశాలలకు తాత్కాలికంగా సర్దుబాటు చేసి రిజర్వ్‌లో ఉంచారు. ఇలా క్లస్టర్ హైస్కూళ్లలో రిజర్వ్‌లో ఉంచిన టీచర్లను మున్సిపల్ పాఠశాలల్లో ఎవరైనా ఉపాధ్యాయుడు సెలవు పెడితే అక్కడ బోధనకు విఘాతం కలుగకుండా ప్రత్యామ్నాయంగా క్లస్టర్ టీచర్లను తాత్కాలికంగా పంపించేందుకు వీరి సేవలను వినియోగించుకునేలా ఏర్పాట్లుచేసిన విషయం విదితమే.

కొత్త కోడలికి..అత్తగారి ఊరిలోనే పోస్టింగ్



ముదినేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తొలి ప్రయత్నంలోనే మెగా డీఎస్సీ - 2025లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన ముదినేపల్లి మండలం గురజకు చెందిన ఐలూరి శ్రీనాగతేజకు తొలి పోస్టింగులో కూడా అదృష్టం కలసి వచ్చింది. కోడలిగా వెళ్లిన గ్రామంలోనే ఉద్యోగం వచ్చింది. ఆమెకు తన అత్తవారి గ్రామమైన కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం అర్తమూరు హైస్కూల్‌లో ఎస్జీటీగా (లెక్కలు) నియామకం పొందింది. ఆమెకు గత ఆగస్టులో వివాహం కాగా, ఆమె భర్త బాలఫణి శర్మ అక్కడికి సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

■ లోపలి పేజీలో..

అనర్హులకు.. ఇంటి పట్టాలు?



పిచ్చిమొక్కలతో నిండిన లేఅవుట్

- లక్కవరం జగనన్న కాలనీల్లో.. అధికశాతం ఖాళీగా ఉన్న స్థలాలు
- ఇళ్లు కట్టేందుకు ముందుకురాని లబ్ధిదారులు

లక్కవరంలో జగనన్న లే అవుట్ కాలనీలలో అనర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో వారంతా ఇళ్లు కట్టకుండా గత ఐదేళ్లుగా వదిలి వేశారనే ఆరోపణలున్నాయి. మరోవైపు అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలు కనీస మౌలిక సదుపాయాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరంలో గ్రామంలో మూడు లే అవుట్ కాలనీలలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. గ్రామ సచివాలయం వద్ద వేసిన లే అవుట్ కాలనీలో 21 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేయగా 14 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. వీరిలో కొందరు నివాసం ఉంటున్నారు. బందెల దొడ్డి సెంటర్ లే అవుట్ కాలనీలో 120 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయగా కేవలం 40 మంది మాత్రమే ఇళ్లు పూర్తి చేశారు. ఎస్సీ లే అవుట్ కాలనీ లో 88 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయగా 41 మంది మాత్రమే ఇళ్లు పూర్తి చేశారు. మొత్తం 229 ప్లాట్‌లకు 217 మందికి ఇంటి రుణాలు మంజూరయ్యాయి. కానీ వీరిలో కేవలం 95 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మిగిలిన 122 మంది లబ్ధిదారుల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని స్థలాలను అసలు ఏ పనీ మొదలు పెట్టకుండానే ఖాళీగా వదిలేశారు.

చిట్టడవిలా దర్శనమిస్తున్న లే అవుట్ కాలనీలు

గ్రామంలోని ఎస్సీ లే అవుట్ కాలనీ, బందెలదొడ్డి సెంటర్‌లోని లే అవుట్ కాలనీలలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిలా దర్శనమిస్తున్నాయి. పాములు, తేళ్ళు వంటి విషపురుగులు తిరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మంచినీటి కోసం ట్యాంకు కూడా నిర్మాణం చేయక పోవడంతో బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు. తాగడానికి వాటర్ ప్లాంట్‌ల నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారు. రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం వస్తే వరద నీరంతా ఇళ్ల ముందుకు వచ్చి చేరుతోందని ఆ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వడం వల్లనే ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేయడం లేదని, అందువల్లనే తమ కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని అక్కడ నివాసం ఉంటున్నవారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రూ.కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలకు అర్హులకు ఇచ్చారా.. లేక అనర్హులకు ఇచ్చారా.. అన్న దానిపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హులైతే వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, అనర్హులైతే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తమ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ఉల్లి మార్కెట్లో అధికారుల పర్యవేక్షణ

- ఆంధ్రజ్యోతి కథనంపై కలెక్టర్ ఆదేశాలు



తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను పరిశీలిస్తున్న మార్కెట్, సివిల్ సప్లయ్ అధికారులు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : 'కడప ఉల్లి ధర ఢమాల్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. పశ్చిమ కలెక్టర్ నాగరాణి తాడేపల్లిగూడెంలోని మార్కెట్ యార్డు, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులకు తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. ఉల్లి రైతులకు న్యాయం జరిగేలా దగ్గరుండి మార్కెట్‌ను పర్యవేక్షించాలని సూచించారు. దీంతో మార్కెట్‌యార్డు ఏడీ సునీల్‌కుమార్, తాడేపల్లిగూడెం మార్కెట్ కమిటీ కార్యదర్శి గౌస్ బాషా, సూపర్ వైజర్లు ఫణికిషోర్, వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన సివిల్ సప్లయ్ డీటీలు తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను సందర్శించారు. కడప రైతులతోను, ఉల్లి వ్యాపారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులను కోరారు. దీనిపై వ్యాపారులు కూడా స్పందించారు. నాణ్యమైన ఉల్లి కడప నుంచి రాకపోవడం వల్లే కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ధర తక్కువగా పలుకుతుందని అధికారులకు వివరించారు. నాణ్యమైన ఉల్లిని కొనుగోలుచేయడానికి తాము ముందుంటామని వ్యాపారులు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉంటే తాడేపల్లిగూడెం మార్కెట్‌కు కడప నుంచి నాలుగు లారీల్లో ఉల్లి వచ్చింది. దీని ధర క్వింటా రూ.600 నుంచి రూ.1,200 వరకు నిర్ణయించారు. తీసుకొచ్చిన 4 లారీల్లో మూడు లారీల్లో వచ్చిన ఉల్లి నాణ్యతగా ఉండటంతో క్వింటా రూ.900 నుంచి 1200 మధ్య ధర పలికింది. మరో లారీ నాణ్యత లేకపోవడంతో క్వింటా రూ.600కు విక్రయించారు.

నేడు ఆర్‌జేడీఎం రాక

మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ (ఆర్‌జే డీఎం) శ్రీనివాస్ మంగళవారం రానున్నారు. వ్యాపారులతోను, రైతులతోను, సంబంధిత విభాగం అధికారులతో సమీక్షిస్తారు.



జోరు వర్షంలోనూ వినతులు

ఏలూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జోరు వర్షంలోనూ అర్జీదారులు పెద్ద సంఖ్యలో విచ్చేసి వినతులు అందించారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు.కలెక్టర్‌తో పాటు జేసీ ఎంజే అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరావు, డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, జడ్పీ సీఈవో శ్రీహరి, డీపీవో అనురాధ, సర్వే ఏడీ అన్సారీ 224 అర్జీలను స్వీకరించారు.



సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఏలూరు క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ చేసిన వారిని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తు న్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ రిటైర్డ్ ఉద్యోగులకు సూచించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, అర్చకులు

వైభవంగా వాడపల్లి
వెంకన్న కల్యాణం

వాడపల్లిలో నాలుగో రోజుకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గోవిందనామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల

ఆత్రేయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పండితుల వేదమంత్రోచ్ఛరణలు, కళాకారుల ప్రదర్శనలు, భక్తుల గోవిందనామస్మరణతో వాడపల్లి మార్మోగుతోంది.

సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాటం, కర్రసాము ప్రదర్శనలు భక్తులను ఉర్రుతలూగించాయి. రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహం పొందారు.





శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, సింహ వాహనంపై శ్రీవారు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం

ప్రాణం నిలిపే సీపీఆర్

వైద్య విద్యార్థుల అవగాహన కార్యక్రమాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన వారి ప్రాణాలను సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) నిలబెడుతుందని వైద్యులు తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల, కస్తూరిబా మునిసిపల్ బాలికోన్నత పాఠశాలల్లో అత్యవసర వైద్య ప్రక్రియ వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. మహిళలు, పురుషుల జనాభా నిష్పత్తి సమానంగా ఉండేలా ఆడశిశువులను రక్షించాలని, వారిని చదివించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ మాట్లాడుతూ ఆడశిశువులను రక్షించాలని సూచించారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం (పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు-1994)పై ప్రతీఒక్కరు అవగాహన కలిగిఉండాలని కోరారు. ఈ చట్ట నిబంధనలను అతిక్రమించినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కలిగిస్తామని వైద్య విద్యార్థులతో డీఎంహెచ్‌వో అమృతం ప్రతిజ్ఞ చేయించారు. ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ పూజ, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశిధర్, డీపీహెచ్‌ఎన్‌వో జ్యోతి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ హెచ్‌ఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలు

ఈ నెల 16 వరకు దరఖాస్తు గడువు

ఏలూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐల్లో మిగిలివున్న సీట్ల భర్తీకి ఐదో విడత కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం కల్పించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ డి.భూషణం సోమవారం తెలిపారు. దరఖాస్తు ప్రింటవుట్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థి తాను ఎంచుకున్న ఐటీఐలో 16న సాయంత్రం 4గంటల్లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. ప్రవేశాలకు ఈ నెల 17న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని సూచించారు.



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో రొబోటిక్ సర్జరీ చేస్తున్న వైద్యులు

విర్డ్‌లో రొబోటిక్ వైద్య సేవలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రొబోటిక్ టెక్నాలజీతో విర్డ్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఐదుగురికి రొబోటిక్ అర్థో శస్త్రచికిత్స ఈనెల 12న డాక్టర్ కృష్ణకిరణ్ నేతృత్వంలో నిర్వహించినట్లు ట్రస్టు చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. వైద్యులు కృష్ణకిరణ్ మాట్లాడుతూ రొబోటిక్ టెక్నాలజీతో ఆపరేషన్ ద్వారా రోగికి మెరుగైన, కచ్చితమైన, రక్షణతో కూడిన వైద్యం అందుతుందన్నారు. సర్జన్ ఆదేశాల మేరకు రోబో పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం వైద్య చికిత్సలను అందించడంలో రోబో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పి.నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



వరండాలో చదువుకుంటున్న ఏలూరు బీసీ హాస్టల్ విద్యార్థినులు



దెందులూరు హాస్టల్లో ఆవరణలో నిలిచిపోయిన మురుగు



పెంటపాడులో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం

సంక్షామం

- వసతి గృహాలలో అరకొర సౌకర్యాలు
- మరుగుదొడ్డి, మురుగు సమస్యలు
- పలు చోట్ల భవనాలు శిథిలం

సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్‌లో దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం లేదు. కూటమి ప్రభుత్వం టాయిలెట్లు, గదుల మరమ్మతులపైనే దృష్టి పెట్టింది. విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. కాస్మోటిక్స్ చార్జీలు నాలుగు నెలల నుంచి విద్యార్థులకు చెల్లించలేదు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఆంధ్రజ్యోతి బృందం సోమవారం హాస్టల్స్ పరిశీలించింది.

దెందులూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించకపోవడంతో విద్యార్థులకు శాపంలా మారాయి. దెందులూరు మండలం కొవ్వలి సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సౌకర్యాలు కొరవడ్డాయి. సోలార్ సిస్టం పాడైంది, మరుగుదొడ్లు సక్రమంగా లేవు, వాడకం నీరు, మురుగు హాస్టల్ ఆవరణలో నిలిచిపోతుంది. వర్షం పడితే వసతిగృహం ఆవరణ నీట మునుగుతోంది. విద్యార్థులకు రక్షిత నీరు లేదు. ప్రస్తుతం 50 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఆరుగురు సిబ్బందిలో ఇద్దరు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దెందులూరు ఎమ్మెల్యే మట్టి గ్రావెల్‌తో హాస్టల్ ఆవరణ మెరక చేయించడంతో ముంపు సమస్యకు తెరపడినా మురుగు సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

అద్దె భవనాలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో 113 మంది విద్యార్థులున్నారు. ఇంటర్ విద్యార్థులు 103 మంది, డిగ్రీ విద్యార్థులు 10 మంది కాగా సోమవారం 38 మంది విద్యార్థులు మాత్రమే హాస్టల్‌లో ఉన్నారు. మిగిలిన విద్యార్థులు దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లి ఇంకా తిరిగి రాలేదని హాస్టల్ వార్డెన్ శివయ్య తెలిపారు. హాస్టల్ భవనం అద్దె దాదాపు రూ.6లక్షలు. చిన్న చిన్న గదుల్లో పది మంది చొప్పున కిక్కిరిసి పడుకుంటున్నారు. మరుగుదొడ్లు నిర్వహణలోపంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. వంట చేయడానికి హాస్టల్ వార్డెన్ ఇద్దరు మహిళలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. వాచ్‌మెన్ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. సౌకర్యాలు అంతంత మాత్రమే.

పెచ్చులూడుతున్న భవనాలు

ఏలూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. గత నెల నుంచి నూతన మెనూ అమలుకు ప్రభుత్వం ఆదేశించినా అమలు కావడం లేదు. ఏలూరు బాలికల సాంఘిక సంక్షేమ హస్టళ్లలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అనేక చోట్ల పెచ్చులూడిన భవనాలలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. వరండా కుంగిపోయి, హాస్టల్ వెనుక భాగంలో గోడ కూలిపోయింది. కొంతమంది ఆకతాయిలు బాలికలను వేధిస్తున్నట్లు తెలిసింది.

హాస్టల్ సౌకర్యాలు అంతంత మాత్రం

ఉంగుటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్షేమ హాస్టళ్ల పనితీరు అంతంత మాత్రంగా ఉంది. నారాయణపురం, కైకరం, ఉంగుటూరు, బొమ్మిడి వసతి గృహాలలో పూర్తి సౌకర్యాలు లేవు. బాలికల వసతి గృహాలలో మరిన్ని ఇబ్బందులు. నారాయణపురంలో 60 మంది, ఉంగుటూరులో 45 మందికి 36 మంది, కైకరంలో 55 మంది హాజరయ్యారు.

వార్డెన్ లేరు

ఆకివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ బాలురు వసతిగృహానికి పూర్తిస్థాయి సంక్షేమ అధికారి (హెచ్‌డబ్ల్యూవో) లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న పాలపతి శ్రీధర్‌పై ఆరోపణల నేపథ్యంలో మెడికల్ లీవులో వెళ్లడంతో అధికారులు పిలిపించి విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఫణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరుగుదొడ్లు, బాతురూమ్‌లు, పైపుల మరమ్మతులు చేయించాలని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సచివాలయంలో హాస్టల్

పెంటపాడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెంటపాడులో ఎస్సీ బాలురు, బాలికలు, పరిమెళ్లలో ఎస్సీ బాలుర వసతి గృహాలున్నాయి. బీసీ హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో వసతిగృహ భవనంలో కొన్నిరోజులు సచివాలయం నిర్వహించారు. ప్రస్తుతం సచివాలయ భవనం నిర్మాణం పూర్తి కావడంతో అది ఖాళీగా ఉంది. బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులను ఖాళీగా ఉన్న సచివాలయం 1 భవనంలోకి మార్చారు.



ఆకివీడులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



జంగారెడ్డిగూడెంలో ఇరుకు గదిలో పడుకున్న విద్యార్థులు



నారాయణపురం బాలికల వసతిగృహంలో అల్పాహారం

సౌకర్యాలు మెరుగుపరిచారు



నరసాపురం ఎస్టీ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

తణుకు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో కూటమి ప్రభుత్వం సౌకర్యాలు మెరుగుపరచడంతో ఆహ్లాదకర వాతావరణ ఏర్పడింది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.5 కోట్లతో నిర్మించిన జీ ప్లస్ 1 భవనాలు 2018లో ప్రారంభించారు. పట్టణ, గ్రామానికి దూరంగా నిర్మించిన భవనాలలో ఎస్సీ విద్యార్థులకు రెండు కళాశాల హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. అయితే చిన్నపాటి మరమ్మతులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. ప్రస్తుతం వసతి పొందిన ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరిచారు. మొత్తం 100 మంది విద్యార్థులకు వసతి అవకాశం ఉన్నా ప్రస్తుతం 40 మంది ఉన్నారు. విద్యార్థులు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం తమ వెంట తీసుకెళ్లి, రాత్రి భోజనం హాస్టల్‌లో చేస్తున్నారు.

నరసాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. మెనూతో పాటు కాస్మొటిక్ చార్జీలను కూడా విద్యార్థులకు అందిస్తున్నారు. గతంలో అరకొర సౌకర్యాల కారణంగా విద్యార్థుల సంఖ్య తక్కువ. ప్రస్తుతం సౌకర్యాలు మెరుగుపరచడంతో 70 మంది విద్యార్థులున్నారు. ఇటీవల బాత్‌రూమ్‌లు, హాస్టల్ భవనాలు మరమ్మతు చేయించారు. దోమల తెరలు, దుప్పట్లు ఇప్పటికే అందించారు.



పైడిపర్రు ఎస్సీ కళాశాల హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం వల్లూరు బాలికల బీసీ హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించారు. హాస్టల్‌లో ప్రస్తుతం 25 మంది బాలికలు ఉన్నారు. దసరా సెలవుల అనంతరం మరికొందరు విద్యార్థులు రావలసి ఉంది. హాస్టల్‌లో అల్పాహారం, భోజనం, తాగరునీరు వసతులపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.



వర్షంతో ఛిద్రమైన మొగల్తూరు-వెంప ఆర్ అండ్ బీ రహదారి



కుక్కునూరు - అశ్వారావుపేట రహదారి



ఆకివీడు మండలంలో తాళ్లకోడు కాలనీలో అడుగు పెట్టడానికి కూడా వీలులేని రోడ్డు

రహదారులు ఛిద్రం

- వర్షాలతో మరింత అధ్వానం
- అడుగడుగునా గోతులు
- తరచు ప్రమాదాలు
- వాహనాలకు మరమ్మతులు
- నడక కూడా కష్టమే

రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు వర్షాలతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఆర్ అండ్ బీ రహదారులపై వాహన రాకపోకలు సాగించడం సాహసమే. గ్రామీణ రహదారులు అడగుగడుగునా గోతులతో అస్తవ్యస్తంగా మారితే పలు గ్రామాల్లోని కాలనీ రహదారులు అసలు అడుగే పెట్టలేని పరిస్థితి. అధిక శాతం రోడ్లు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతుంటే ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణంలో బిల్లుల చెల్లింపులో జాప్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు ప్రమాదాలకు మార్గంగా ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు - అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మళ్లీ గోతులమయంగా మారింది. రహదారిపై గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనాన్ని ముందుకు నడపలేని పరిస్థితి ఏర్పడింది. పదేళ్లుగా ఈ రహదారిపై ప్రజలు నరకం చూశారు. తిరిగి అదే పరిస్థితి నెలకొంది. గతేడాది నుంచి ఈ రహదారి పనులు ప్రారంభమైనా ఇప్పటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తయిన చోట మళ్లీ గుంతలు పడ్డాయి. కుక్కునూరు, వేలేరుపాడు ప్రజలు తెలంగాణలోని భద్రాచలం, అశ్వారావుపేట ఇతర ప్రాంతాలకు ఈ ప్రధాన రహదారిపై నిత్యం ప్రయాణిస్తుంటారు. వైసీపీ హయాంలో అధ్వానంగా మారిన 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి దాదాపు రూ.36 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టరు 8 కిలోమీటర్లు పనులు చేసిన అనంతరం బిల్లులు రాకపోవడంతో పనులు చేయలేదు. అనంతరం కూటమి ప్రభుత్వం పనులు చేపట్టి సింగిల్ లేయర్ తారు పనులు పూర్తయ్యాయి. బిల్లు చెల్లింపులో జాప్యంతో సెకండ్ లేయర్ తారు పనులు జరగలేదు. అధిక వర్షాలతో గోతులు పడ్డాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ హరికృష్ణ మాట్లాడుతూ బిల్లు చెల్లింపులో జాప్యం వాస్తవమే. నవంబర్ నుంచి రహదారి పనులు మొదలవుతాయని తెలిపారు.

నిధులున్నా కదలని పనులు..

మొగల్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా రహదారి నిర్మాణానికి మోక్షం లేదు. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి భీమవరం మండలం వెంప గ్రామం వరకూ ఐదు కిలో మీటర్ల ఆర్‌అండ్‌బి రహదారికి 2020 నవంబరులో వైసీపీ ప్రభుత్వం రూ.12.64 కోట్లు మంజూరు చేసింది. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి వెంప వంతెన వరకూ 5.200 కిలో మీటర్ల రహదారి వెడల్పు చేయడం, నిర్మాణ పనులు నోచుకోకపోవడంతో శంకుస్థాపనకే పరిమితమైంది. రహదారి పెద్ద గోతులు మారి చినుకు పడితే గోతులు నీటితో నిండి ప్రయాణం నరకంగా మారింది. మొగల్తూరు పంచాయతీ పేట పల్లం, పెద్దగొల్లగూడెం, పడమటిపాలెం, నక్కావారి పాలెం, గోగులమ్మపేట, కొత్తపాలెం గ్రామస్తులతో పాటు మొగల్తూరులోని ప్రభుత్వ కార్యాలయాలకు, విద్య, వైద్య అవసరాలకు జిల్లా కేంద్రం కోసం భీమవరం వెళ్లడానికి తిప్పలు తప్పడం లేదు.

కాంట్రాక్టు రద్దుకు సిఫారసు

మొగల్తూరు-వెంప రహదారి నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకపోవడంతో కాంట్రాక్టు రద్దుచేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు ఆర్‌అండ్‌బి అధికారులు తెలిపారు. యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లు అధ్వానం

ఏలూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ప్రధాన రహదారి అస్తవ్యస్తమైంది. తారు తుడిచి పెట్టుకుపోయి కంకర తేలింది. గుంతల్లో వర్షపునీరు చేరి ఎక్కడ గుంత ఉందో గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేస్తే రాకపోకలకు సౌలభ్యంగా మారుతుందంటున్నారు.

కామవరపుకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు గ్రామీణ అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులను అభివృద్ధి చేయాలని, కనీసం గోతులను పూడ్చాలని గ్రామీన ప్రజలు కోరుతున్నారు.

వర్షం కురిస్తే అడుగు పెట్టలేం

ఆకివీడు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే తాళ్లకోడు కాలనీవాసులు అడుగు బయట పెట్టలేని పరిస్థితి. మండలంలోని ఆకివీడు, కుప్పనపూడి, అజ్జమూరు, దుంపగడప, కోళ్లపర్రు, కళింగపాలెం గ్రామాల ప్రజలకు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో ఇంటి స్థలాలు కేటాయించారు. మౌలిక వసతులు కల్పించకుండానే గత ప్రభుత్వం ఒత్తిడితో ఇళ్లు నిర్మించుకునేలా చేసింది. అక్కడ పరిస్థితి దయనీయంగా ఉంది. వర్షం కురిస్తే అడగు బయట పెట్టలేనంతగా రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. వాహనాలు వెళితే గాడులు పడుతున్నాయి. మురుగునీరు, వర్షం నీరు వెళ్లేందుకు కచ్చా డ్రెయిన్లు కూడా లేకపోవడంతో పరిస్థితి మరింత దుర్భరంగా ఉందని, చీకటి పడితే దోమలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. చీకటి పడేలోపు ఇంటికి చేరకుంటే ఎక్కడైనా ఉండిపోవాల్సిందే. ఉపాధిహామీ పథకంతోనైనా కచ్చా డ్రెయిన్లు తవ్వి మురుగునీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్లు త్వరిత గతిన నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఏలూరు జాలిపూడి రహదారిపై గుంతల్లో వర్షపు నీరు



పెనుగొండలో వర్షపు నీటితో మునిగిన రహదారి



గోతుల మయమైన కామవరపుకోట గ్రామీణ రహదారి

కార్తీక మాసం ఏర్పాట్లకు పందిరి రాట



కార్తీక మాసం ఏర్పాట్ల నిమిత్తం పందిరి రాట పాతుతున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రమైన శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం 10.10 గంటలకు స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రంలో ఆలయం ఈశాన్య ప్రదేశంలో పందిరి రాటను పాతారు. కాగా సప్త సోమవారాలు.. సప్త ప్రదక్షిణలు కార్యక్రమంలో భాగంగా సోమవారం వందలాది మంది భక్తులు మాడవీధుల ప్రదక్షిణలు చేశారు.

రసాయన ఎరువులతో దోమపోటు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. దయాకర్

ఆచంట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):సార్వా వరిలో ఆశించే దోమ పోటు ఎక్కువగా రావడానికి అధికమోతాదులో రసాయన ఎరువులు వాడటమేనని పరిశోధనా స్థానం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.దయాకర్ అన్నారు. ఆచంట మండలం ఎ. వేమవరం శివారు పడమటిపాలెంలో మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంబైండ్ హార్వెస్టర్‌తో కోత కోసిన పొలాలలో గడ్డి తగులబెట్టకుండా నేలలో కలియదున్నడం వల్ల సుమారు 25 శాతం రసాయన ఎరువుల అవసరం తగ్గుతుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి మాట్లాడుతూ దళ్వా రకాలైన ఎంటీయు 1293, ఎంటీయు1282 రకాలు నవంబరు నెలాఖరు కల్లా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారమన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌కు మాంటిస్సోరి విద్యార్థులు



విజేతలతో మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తణుకు మాంటిస్సోరి విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా కొవ్వలిలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు చేకూరి రిత్విక్ వర్మ అండర్-14 జిల్లా జట్టుకు, బవిరిశెట్టి ఎస్.వి.ఎస్.హర్ష వీరేంద్ర అండర్17 జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాలు..

ఈ నెల 11,12, తేదీలలో ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో తమ తమ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని ప్రకాశరావు తెలిపారు. కుదప శ్రీమాధవ, అండర్ 8-10లో ఆళ్ళ శ్రీహరి ప్రకాశ్, క్వాడ్‌లో ఆళ్ళ శైలజ, అండర్ 10-12లో చిక్కాల లావణ్య, చేకూరి కనిష్ వర్మ పతకాలు సాధించినట్టు తెలిపారు. నవంబరు 1,2,3, తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-6, 8 కుదప శ్రీమాధవ, అండర్8-10 ఆళ్ళ శ్రీహరి ప్రకాశ్, అండర్10-12 చిక్కాల లావణ్యలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

జిల్లా టీవీ టెక్నీషియన్ల కార్యవర్గ ఎన్నిక



పాలకొల్లు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా టీవీ టెక్నీషియన్ల కార్యవర్గ ఎన్నిక స్థానిక సమతా మహిళ మండలి భవనంలో సోమవారం జరిగింది. రాష్ట్ర టీవీ టెక్నీషియన్ల కుటుంబ సంక్షేమ ట్రస్ట్ బోర్డు వైస్ చైర్మన్ మానెం బసరాజు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చేకూరి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ టీవీ టెక్షీయన్ల సమస్యలు, వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎతఈటీయూ రాష్ట అధ్యక్షుడు మధుసూధన రెడ్డి మాట్లాడారు. అనంతరం జిల్లా టీవీ టెక్నీషయన్ల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్‌గా బండి దుర్గా ప్రసాద్ (టిపిగూడెం), ప్రధాన కార్యదర్శిగా ఈమని గ్రీష్మకుమార్, కోశాధికారిగా నిమ్మ శ్రీధర్, 9మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

20లోపు ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

గణపవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీలంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మి కోరారు. ఉపాధిహామీ పనులపై గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఫీల్డ్అసిస్టెంట్లు మేట్స్ ద్వారా ఈకేవైసీ పనులు చేయించుకున్న శ్రామికులకు మాత్రమే ఉపాధి పని చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

3 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

తణుకు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాని కోరుతూ వచ్చేనెల 3 నుంచి సమ్మెకు సమాయత్తమవుతున్నారు. ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు ఈ వివరాలు వెల్లడించారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరిణించిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం టౌన్: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అందుకే వచ్చేనెల 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు తెలిపారు. సమ్మె నోటీసును మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మృతి చెందిన, రిటైర్డు అయినటువంటి ఔట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, 12వ పిఆర్సీ ప్రక టించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ హేలాపురి ఉత్సవాలు

సడలింపులపై అవగాహన ర్యాలీ.. బుల్లెట్‌పై కలెక్టర్ వెట్రిసెల్వి



స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో మరింత అవగాహన కోసం హేలాపురి ఉత్సవాలు పేరిట వారం రోజు వివిధ కార్యక్రమాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నగరంలో శాంతినగర్ పోలీస్ పెట్రోల్ బంకు నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ అభిషేక్ గౌడ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. హెల్మెట్లు ధరించి బైక్‌లతో ముందుకు సాగగా, కలెక్టర్ వెట్రిసెల్వి పోలీస్ అధికారి బుల్లెట్ ఎక్కి సాగడం గమనార్హం. ఉత్సవాల్లో భాగంగా గిరిజన భవన్‌లో గ్రాండ్ షాపింగ్ ఫెస్టివల్‌ను కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగినప్పుడు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సీఆర్‌రెడ్డి కళాశాలలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. అధిక మొత్తంలో షాపింగ్ చేసిన వారి పేర్లను ఉత్సవం చివరి రోజు డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీటీసీ షేక్ కరీమ్, కార్మిక శాఖ డీసీ జి.నాగేశ్వరరావు, కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



నగరంలో జీఎస్టీ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ర్యాలీలో ఎస్పీ కేపీఎస్ కిశోర్

మంత్రి పార్థసారథికి ఆహ్వానం

జీఎస్టీ సంస్కరణలపై నిర్వహిస్తున్న హేలాపురి ఉత్సవ్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి కొలుసు పార్థసారధికి కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఆయన వెంట జి.జాన్‌బాబు ఉన్నారు.





జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం ప్రభుత్వాసుపత్రుల వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికులు ధర్నా

- విధుల బహిష్కరణ
- వేతన బకాయిల కోసం డిమాండ్
- సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు జీతాలు, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పారిశుధ్య కార్మికులు కలిసి సోమవారం విధులను బహిష్కరించి ధర్నా చేశారు. గత కొన్ని నెలలుగా తమ సమస్యలను పరిష్కరించాలని తమ జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఎన్నిసార్లు జిల్లా ఉన్నతాధికారులకు, ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ సెకండరీ హెల్త్ అధికారులకు ఎన్ని లేఖలు రాసినా ప్రయోజనం లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులు ఇప్పటికైనా స్పందించి జీతాల బకాయిలను, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. బుట్టాయిగూడెం, దెందులూరు, భీమడోలు పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. చింతలపూడి ఏరియా ఆస్పత్రి వద్ద కార్మిక నాయకురాలు టి.మరియమ్మ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. జంగారెడ్డిగూడెంలో ఏఐటీయూసీ నాయకులు జంపన వెంకట రమణ రాజు, వేముల రాజు, మేరీ, దయామణి, జె.దుర్గారావు పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గోకుల పారిజాతగిరిలో హుండీ ఆదాయం లెక్కింపు

గోకుల పారిజాతగిరి వెంకన్న హుండీ

ఆదాయం రూ.12.88 లక్షలు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలలకు గానూ 12,88,615 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాబు నాయుడు ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందని ఈవో తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, జి.భాస్కరరాజు, వాసవీ సాయి నగేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలపై సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ గౌడ

4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- రైతులకు ఇబ్బంది లేకుండా సేకరించాలి
- అధికారులతో జేసీ అభిషేక్ గౌడ సమీక్ష

ఏలూరుసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలను సాధించేందుకు పటిష్ట ప్రణాళికతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలు, ప్రణాళికలపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని, ఏ ఒక్క రైతుకు ఎటువంటి సమస్య రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు తరచూ వచ్చే గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు, తేమ శాతం తదితర సమస్యలు, ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, వాటిపై ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్లు, రవాణాపరమైన ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ దేవకీదేవి, డీఎస్‌వో ఈబి విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి.శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా, డీపీవో ఆరిమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల బీమా చెల్లింపులకు నిధులు విడుదల

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కాలువలో గల్లంతైన బాలుడి మృతి

తణుకు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభించింది.ఆదివారం మధ్యాహ్నం తణుకు రూరల్ మండలం పైడిపర్రులో అత్తిలి కాలువలో స్నానం చేసేందుకు బొమ్మనబోయిన జోగేంద్ర(13) దిగాడు. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి గల్లంతవడంతో సోమవారం ఉదయం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన పోలీసులకు సమాచారం అందించారు. తణుకు రూరల్ ఎస్‌ఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మొగల్తూరు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు మొగల్తూరు ఏఎస్‌ఐ సుబానీ తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన ఒక కుటుంబం ఇటీవల మొగల్తూరు నాగదేవత కాలనీకి వచ్చి నివాసం ఉంటోంది.ఆ కుటుంబానికి చెందిన బాలిక(13) సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు

లింగపాలెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఐదుగురిని ధర్మాజీగూడెం పోలీసులు అరెస్టు చేశారు. లింగపాలెం గ్రామానికి చెందిన దంపతులు గత నెల 23న పెదవేగి మండలం బాపిరాజుగూడెం వెళ్లి ధర్మాజీగూడెం నుంచి వస్తుండగా మార్గమధ్యలో కొందరు మహిళ మెడలోని గొలుసు లాక్కుని పరారైనట్టు తెలిపారు. నిందితులు వలసపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్నట్టు సమాచారం తెలుసుకుని ఎస్‌ఐ వెంకన్న తన సిబ్బందితో వెళ్లి చాకచక్యంగా అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.

బొండాడలో ఎక్సైజ్ దాడులు

కాళ్ళ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఏడు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్‌ఐ వి.కరుణప్రియ తెలిపారు.

రౌడీ షీటర్‌పై హత్యాయత్నం కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిపై ఇనుపరేకుతో పీకకోయడానికి యత్నించిన రౌడీ షీటర్‌పై ఏలూరు టూటౌన్ పోలీసులు హత్యాయత్నం కేసును నమోదు చేశారు. ఏలూరు ఎంఆర్‌సీ కాలనీలో ఇటీవల కనకదుర్గమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ గొడవ జరిగింది. గొడవను పురస్కరించుకుని అదే ప్రాంతానికి చెందిన సుందరపు గంగాధరరావుపై యడ్ల గణేశ్ కక్షపెంచుకున్నాడు. ఈ నెల 12న ఆ గుడి వద్ద అన్న సంతర్పణ జరిగిన సమయంలో గంగాధరరావుపై యడ్ల గణేశ్ ఇనుపరేకుతో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గంగాధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఏలూరు కత్తేపు వీధికి చెందిన పుప్పాల పవన్‌కుమార్(40) లారీల ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈనెల 11న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అందడంతో ఎస్‌ఐ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

ఏలూరుక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):రైలు ప్రమాదాల్లో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓవర్ బ్రిడ్జి కింద సోమవారం ఉదయం ఒక గుర్తు తెలియని దివ్యాంగుడు పట్టాలపై నడిచి వెళ్తున్నాడు. ప్రమాద వశాత్తు అదే సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి కుడి కన్ను, కుడి చేయి లేదు. ఇతను ఎక్కడివాడో ఇక్కడకు ఎందుకు వచ్చాడో కూడా తెలియదు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ రత్నం, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వారి సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● భీమవరం క్రైం: భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకివీడు-పల్లెవాడ రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వృద్ధుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఆకివీడు స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో భీమవరం జీఆర్‌పీ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 ఏళ్ల వ్యక్తి తెలుపు రంగు చొక్కా, పర్పుల్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని అన్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఒకరికి గాయాలు



గాయపడిన వీరాస్వామి

మొగల్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన ఎక్స్‌కవేటర్ ఢీకొట్టింది. మొగల్తూరు జాతీయ రహదారిపై హెరిటేజ్ పాలకేంద్రం వద్ద లారీలో పాల లోడు దిగుతున్న సమయంలో అటు పక్కగా పెట్రోల్ బంక్ నుంచి వస్తున్న ఎక్స్‌కవేటర్ ఎదురుగా వస్తున్న స్కూటరిస్ట్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన నడపన వీరాస్వామి అనే వ్యక్తికి కాలు ఇరిగడంతో పాటు తలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్పందించి 108 వాహనంలో భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చిన తరువాత కేసు నమోదు చేస్తామని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

బాణసంచా స్వాధీనం



మందుగుండు సామగ్రి పరిశీలిస్తున్న పోలీసులు

చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగడవరంలో పోలీసులు దాడులు చేసి మూడుచోట్ల తనిఖీలు జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ అక్రమ తయారీ, నిల్వలపై లైసెన్సు లేకుండా గొడౌన్లలో ఉంచిన ఐదు లక్షల విలువైన బాణసంచాను పట్టుకున్నట్లు తెలిపారు. చంద్రుపట్ల హరీశ్, పసుమర్తి రాంబాబు, చిన్ని నాగబాబులకు చెందిన వీటిని రెవెన్యూ అధికారుల సాయంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌ఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఉండి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి ఉండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకువాడ గ్రామానికి చెందిన కొల్లిపర విజయలక్ష్మితో హైదరాబాద్‌లో ఉంటున్న మామని ప్రసాద్‌కు 12 ఏళ్లక్రితం ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రెండు లక్షల నగదు, బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. కట్నం కోసం భార్య విజయలక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తూ ఇంటి నుంచి గెంటి వేశారు. హైదరాబాద్ నుంచి ఆమె చెరుకువాడకు చేరుకుంది. తదుపరి ఉండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భర్త, అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్‌ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

చింతలపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ కేసులో ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ధర్మాజీగూడెం స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. ధర్మాజీగూడెంతో పాటు భీమడోలు, ఆగిరిపల్లి, ఏలూరుత్రీటౌన్ పరిధిలో మొత్తం 80 గ్రాముల బంగారం చోరీ చేశారని సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చావల భార్గవకృష్ణ, బరగడ హర్షవర్ధన్, కాకపర్తి గణేశ్, బద్ది హేమ అచ్యుత్, కోలా అప్పలరాజులను అరెస్టు చేశామని వీరంతా ఏలూరు నగరానికి చెందినవారన్నారు. మీడియా సమావేశంలో చింతలపూడి సీఐ క్రాంతి కుమార్, ఎస్‌ఐలు సతీశ్ కుమార్, కె.వెంకన్నలు పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

తాడేపల్లిగూడెంరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో భార్య మందలించిందని మస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదుగగుంటకు చెందిన దండ్రు వెంకట్రావు(50) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటి వద్ద ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడంతో భార్య మందలించింది. దీంతో ఇంటికి ఎదురుగా ఉన్న పంట చేల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు దండ్రు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఎండీ జిలాని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఓ వివాహానికి ద్వారకాతిరుమలకు వచ్చిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు తూలిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన యార్లగడ్డ సాంబశివరావు(80)తన మనవరాలి వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 11 రాత్రి ద్వారకాతిరుమలకు వచ్చి ఓ గదిలో ఉన్నారు. 12న తెల్లవారు జామున బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తుండగా గడప తగిలి ముందుకు పడి గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. సుధీర్ తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

కుక్కునూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు గ్రామ శివారులోని రామాలయం వద్ద సోమవారం ఉదయం ఓకారు ప్రమాద వశాత్తు రహదారి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న రాజమండ్రికి చెందిన జాన్ షడక్, రాణి దంపతులు తెలంగాణ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పల్టీ కొట్టిన కారు నుంచి వారిని స్థానికులు బయటకు తీశారు. చిన్నచిన్న గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకు తీశారు. రాజమండ్రి నుంచి తెలంగాణలోని చర్ల గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టండి

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల వల్ల భీమడోలు నుంచి ద్వారకాతిరుమల ప్రధాన రహదారి ఛిద్రమైన నేపథ్యంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అటు క్షేత్రానికి వచ్చే భక్తులు, ఇటు వాహన దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి మరమ్మతులు తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

పోతునూరులో అయ్యప్పలకు భిక్ష

దెందులూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల దీక్షధారులకు పోతునూరులో దాత కందుల నరసింహారావు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో మాలధారులు పాల్గొని భిక్షను స్వీకరించారు. ఏటా అయ్యప్ప స్వాములకు రోజుకు ఒకరు చొప్పున దాత లు ముందుకొచ్చి అన్నదానం, స్వాములకు భిక్ష కా ర్యక్రమాన్ని బ్యాంక్ అధ్యక్షులు మోహన్ బాబు ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నారు.టీడీపీ నాయకులు కందుల నరసింహారావు దంపతులు స్వాములకు పలు రకాల పిండివంటలు, అల్పాహారం, అందించి మాల దీక్షధారుల ఆశీర్వాదం తీసుకున్నారు.

డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం



కొయ్యలగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొయ్యల గూడెం పట్టణానికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. సింగపూర్‌లో జరిగిన ఏషియా పీ.సీ.ఆర్-2025 అంతర్జాతీయ సదస్సులో ఈ గౌరవం దక్కింది. ఈ నెల 11న సింగపూర్‌లో జరిగిన సదస్సులో ఈ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాజమండ్రిలో పల్స్ హాస్పటల్ నిర్వహిస్తున్నారు. ఈయన స్వగ్రామం కొయ్యలగూడెం, ఈ నేపథ్యంలో ఆయనకు పలువురు డాక్టర్లు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సీఆర్‌రెడ్డిలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పెదపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల జువాలజీ, ఫిషరీస్ విభాగాల కెరీర్ గైడెన్స్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఆక్వా రంగంలో ఉపాధి అవకాశాలు - ప్రాధాన్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆక్వా హెల్త్ కేర్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ డివిజన్ జనరల్ మేనేజర్ రిజ్వాన్ అహ్మద్ బాషా మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ప్రోటీన్‌తో కూడిన ఆహారం అవసరమని, అది ఎక్కువగా ఆక్వా ఫుడ్‌లో లభిస్తుందన్నారు. ఆక్వా ఫుడ్ ప్రొడక్షన్ 70 శాతం భారత్‌లోనే తయారవుతుందన్నారు. దీనిలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, విద్యార్థులు నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉండాలన్నారు. కార్యక్రమంలో వంకినేని భాను ప్రకాశ్, జి.సరళ, పి.హిమబిందు, కె.రఘూన్సీ, హెచ్‌వోడీ స్వప్న పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏలూరులో నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మార్కెట్ యార్డు వి.వి.నగర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఐ.ఎఫ్.టి.యు. కార్యకర్తలను రాజకీయంగా చైతన్య పరిచేందుకు ఈ క్లాసులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు కె.నాని, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు పల్లి గంగరాజు, ఎస్ నెహ్రూ బాబు, అన్నవరం, నాగేశ్వరరావు, విజయ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం... శివ కల్యాణం

ద్వారకాతిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న శివదేవుడి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. లోకకల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కల్యాణతంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా,పార్వతీసమేత శివయ్య కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించారు.

ఆది కర్మయోగి అభియాన్‌లో వసతులు కల్పించండి

ఏలూరు,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన, ఆది కర్మయోగి అభియాన్ రెండో దశలో ఆయా గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై గ్రామ అభివృద్ధి ప్రణాళికలను వెంటనే రూపొందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ఈ పథకం పురోగతిపై సోమవారం ఆమె సమీక్షించారు. ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెండో దశలో ఎంపిక చేసిన 31 గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై విజన్, యాక్షన్ ప్లాన్‌లు పూర్తి చేసి గ్రామసభలు నిర్వహించి ఆమోదానికి చర్యలు తీసుకోవాలన్నారు.జడ్పీ సీఈవో శ్రీహరి, ఐటీడీఏ పీవో రాములు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాసాశ్రమ ఉత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఏర్పేడులో మలయాళ స్వాముల వారిచే వ్యాస ఆశ్రమం స్థాపించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి తెలిపారు. శివాలయం ప్రాంగణంలో భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని వివరించారు. నాట్యాచార్యులు కళారత్న కె.వి.సత్యనారాయణ, వ్యాపారవేత్త కె.కె.గుప్త, కాకరాల రాజేంద్రప్రసాద్, మోటూరి వరలక్ష్మి, మురాల మాణిక్యాలరావు, వేణుగోపాల్‌లునాని, పార్వతిరామచంద్రం శిష్యబృందం, లయన్స్ నాయకులు మానేపల్లిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సభకు 20 బస్సులు కేటాయింపు

ఏలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూల్ జిల్లాలో ఈ నెల 16న జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు ఏలూరు జిల్లా నుంచి 20 బస్సులను అక్కడకు పంపనున్నారు. కర్నూల్‌లో స్థానికంగా ప్రజలను తీసుకెళ్లడానికి 9 ఎక్స్‌ప్రెస్, 11 పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు ఏలూరు నుంచి ఈ నెల 15న ఉదయం బయల్దేరి వెళ్లనున్నాయి.



ద్వారకాతిరుమలలో...



ఏలూరు నగరంలోని లోబ్రిడ్జి వద్ద భారీగా చేరిన నీరు

కుండపోత

(5వ పేజీ తరువాయి)

91.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 33.4 మి.మీ నమోదైంది. లింగపాలెం 81.8, బుట్టాయిగూడెం 67, కలిదిండి 46.2, పెదవేగి 58.8, ఏలూరు రూరల్ 44.6, కైకలూరు 41.2, నిడమర్రు 39, ఏలూరు అర్బన్ 37.6, చింతలపూడి 31.2 జీలుగుమిల్లి 31, ఉంగుటూరు 29.4, ముదినేపల్లి 34.2, దెందులూరు 39, కామవరపుకోట 30.2, నూజివీడు 26.6, భీమడోలు 23.2, జంగారెడ్డిగూడెం 28.8, ముసునూరు 28.6, వేలేరుపాడు 20, పోలవరం 19.2, చాట్రాయి 17.4, ఆగిరిపల్లి 15.8టి నరసాపురం 14, ద్వారకాతిరుమల 12.8, మండవల్లి 10.4, కుక్కునూరు 9.4, పెదపాడు 7.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఆరెంజ్ అలెర్ట్ జారీ : జిల్లాలో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు ఆరంజ్ అలెర్ట్ జారీ చేయడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

జంగారెడ్డిగూడెం పట్టణంలో: పట్టణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దంచి కొట్టిన వర్షం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఎనిమిదవ వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిడుగుపాటుకు గురవడంతో మరమ్మతులకు గురైంది. సోమవారం విద్యుత్ రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులంతా విజయవాడ వెళ్లారు. దీంతో విద్యుత్ పునరుద్ధరించే వారే కరువయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రైవేటు వర్కర్లతో పలు చోట్ల విద్యుత్ పనులు చేయించి విద్యుత్ పునరుద్ధరించినట్లు ఏడీఈ సుబ్బారావు తెలిపారు.

ఇ-ఆటోలు మూలన పడ్డాయి



పాడవడంతో నిరుపయోగంగా మారిన వాహనాలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో ఇ-ఆటోలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. పట్టణాల్లో ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకీ అందజేసిన తొమ్మిది ఎలక్ట్రిక్ ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. గత ఏడాది ఇలాగే ఆటోలు మరమ్మతులకు గురికావడంతో రూ.లక్షలు వెచ్చించి రిపేరు చేయించారు. తిరిగి ఇప్పుడు నాలుగు ఆటోలు పనిచేయడం లేదు. దీంతో పట్టణంలోని పలు గృహాల వద్ద చెత్త సేకరించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరమ్మతులకు గురైన ఆటోలను త్వరగా రిపేరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ మాట్లాడుతూ నాలుగు ఆటోలు మరమ్మతులకు గురికావడంతో పాటు బ్యాటరీలు కూడా పనిచేయడంలేదన్నారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఆటోల రిపేరుకు రూ.లక్ష కేటాయించామని, త్వరలో మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.



పెదవేగిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పోలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



భీమడోలులో ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

జీఎస్టీతో సామాన్యులకు లబ్ధి

విస్తృతంగా అవగాహన ర్యాలీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అదనపు లాభాలను అందించేందుకు జీఎస్టీ తగ్గింపు ఉపయోగపడుతుందని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా ఆర్ఐవో కె.యోహాన్ అన్నారు. ఫ్యూచర్ ఎకనామిక్ ట్రెండ్స్ అనే అంశంపై సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీకళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో మరింత ఆదా చేయడానికి అవకాశం ఉందన్నారు. డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు పాల్గొన్నారు.

● పెదవేగి: జీఎస్టీతో సామాన్యులకు లబ్ధి చేకూరుతుందని పెదవేగి ఎంపీడీవో రవికుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ఐసీడీఎస్, డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో పెద వేగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ తగ్గింపుతో అన్ని రకాల వస్తువులపై తగ్గింపు వర్తిస్తుందని, ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ సెమినార్‌లో డ్వాక్రా, ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి, జీఎస్టీతో కలిగే లాభాలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్థికాంశాలపై నిపుణుడు వెంకటరమణ, ఎంఈవో బి.త్రిపుర సుందరి, ఏపీఎం ఏసురత్నం, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అల్లీ సాహెబ్ పాల్గొన్నారు.

● పోలవరం: జీఎస్టీ పన్ను రాయితీ పేదల పాలిట వరమని ఇంచార్జి ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు అన్నారు. సోమవారం పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి పోలవరం వరకూ కార్యాలయ సిబ్బందితో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ నినాదాలు చేస్తూ బైకు ర్యాలీ నిర్వహించారు.

● భీమడోలు: సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో పద్మావతిదేవి అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన సమావేశం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో పద్మావతి దేవి, తహసీల్దార్ రమాదేవి, ఏఎంసీ చైర్మన్ శేషగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జీఎస్టీ పరిధిలోకి వచ్చిన పలు వస్తువులను ప్రదర్శనగా ఏర్పాటు చేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కరణం పెద్దిరాజు, గ్రామ కార్యదర్శి తనుజ, గ్రామస్థులు పాల్గొన్నారు.

● నిడమర్రు: స్వదేశీ వస్తువుల వాడకం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి విజయ కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నిడమర్రులో స్వదేశీ వస్తువుల వాడకం, జీఎస్టీ సవరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంతో స్థానికులకు అవగాహన కల్పించారు.

● లింగపాలెం: సామాన్యుడికి ఉపయోగపడేలా కేంద్రం జీఎస్‌టీని తగ్గించిందని లింగపాలెం మండల డిప్యూటీ ఎంపీడీవో ఎం.సుందరి అన్నారు. మండల కేంద్రం లింగపాలెంలో ఏ వస్తువుపై ఎంతశాతం జీఎస్‌టీ తగ్గిందనే విషయంపై ప్రజలకు అర్థమయ్యేలా అవగాహనార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ వస్తువులను ప్రతి ఎక్కరూ వినియోగించాలని తెలిపారు. కేంద్రం సవరించిన జీఎస్‌టీ స్లాబుల మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. కిరాణాషాపులు, వ్యాపార దుకాణాలకు వెళ్లి జీఎస్‌టీ తగ్గిపుపై వివరించారు. ప్రతి వ్యాపారి ప్రతి వస్తువుపై తగ్గించిన ధరల ప్రకారం విక్రయించాలన్నారు. అనంతరం గ్రామంలో వివిధ శాఖల అధికారులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.సుగుణరాజు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కేబుల్ వైరు అపహరణ

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కు చెందిన కేబుల్ వైర్లను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు జ్యూట్ మిల్లు ఓవర్ బ్రిడ్జి కింద భూమిలో ఉన్న 50 మీటర్ల వైరును గుర్తు తెలియని వ్యక్తి తవ్వి రాగివైరును అపహరించుకుపోయాడు. బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజినల్ ఇంజనీర్ వాకాడ దుర్గా ప్రసాద్ ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సీపీఆర్‌పై అవగాహన అవసరం

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు సత్రంపాడులోని సర్‌సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పించినట్టు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సీపీఆర్ గురించి కళాశాలల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ఎయిడ్ ట్రైనర్ ఎ.ప్రియాంక ఫార్మసీ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, ప్రొఫెసర్ ఎస్.శివరామ్, అసోసియేట్ ప్రొఫెసర్ బి.కుమార్ స్వామి, కె.హెశేష, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వి.నాగరాజు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం/లింగపాలెం/నిడమర్రు/జంగారెడ్డిగూడెం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో సోమవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. బుట్టాయగూడెం మండలానికి ప్రభుత్వం 32 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించగా 30 మంది బాధ్యతలు స్వీకరించారు. కొయ్యలగూడెం మండలానికి 14 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారని మండల విద్యాశాఖాధికారి జే.సురేశ్ బాబు తెలిపారు. కుంతలగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ముగ్గురు విధుల్లో చేరారు. లింగపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. వారిని ఎంఈఓలు కె.రామారావు, జె.రవీంద్ర అభినందించారు. నిడమర్రు మండలంలో వివిధ పాఠశాలల్లో డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి విద్యాశాఖాధికారులు టి.అనూరాధ, వై.శేషగిరిరావు జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. మండల వనరుల కేంద్రం సిబ్బంది నారాయణదాసు, రామకృష్ణ, ఆళ్ల నరేశ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో డీఎస్సీలో ఎన్నికయ్యి ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. పాఠశాలలకు వెళ్లగానే నూతన ఉపాధ్యాయులకు సీనియర్ ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు.



నిత్య భిక్షలో పాల్గొన్న స్వాములు

స్వాములకు భిక్ష ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో అప్పపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో సర్వమాల దీక్ష స్వాములకు తృతీయ వార్షికోత్సవంగా 50 రోజుల పాటు జరిపే నిత్యభిక్ష కార్యక్రమాన్ని సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప, భవానీ, గోవింద, శివదీక్షలు చేపట్టిన స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు, అర్చనలు జరిపి విశేష హారతులిచ్చి అనంతరం అన్నదాన సమాజం అధ్యక్షులు కొట్టు మధువెంకట్రావు, మనోజ్ బృందం సర్వమాలలు చేపట్టిన స్వాములకు భిక్షను ప్రారంభించారు. డిసెంబరు 1వ తేదీ వరకు స్వాములకు నిత్యభిక్ష కార్యక్రమం జరుగుతుందని అన్నదాన సమాజం అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సుప్రీం కోర్టు సీజేపై దాడి హేయం

ఏలూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కందుల రమేశ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఉన్న వ్యవస్థలన్నీ రాజ్యాంగబద్ధంగా నడిపించేందుకు న్యాయ వ్యవస్థకు ప్రత్యేక అధికారాలు కట్టబెట్టిందన్నారు. అలాంటి అత్యున్నత న్యాయ వ్యవస్థకు ప్రథమ ప్రతినిధిగా ఉన్న న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం క్షమించరాని నేరమన్నారు. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళి మాట్లాడుతూ ఈ చర్య రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మీద దాడిగా పరిగణించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధు, వెంకటేశ్వరరావు, రుద్రయ్య, హైమావతి, రమేశ్, పాముల ఏసు, బి.ఆర్.చౌదరి, పాల్గొన్నారు.

డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి : చంటి



వర్షంలో డ్రెయిన్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకు పోవడంతో నీటి పారుదల లేక నగరం జలమయమైంది. నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి నగరంలో సహాయక చర్యలు చేపట్టారు. డ్రైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. నిలిచిపోయిన వర్షపునీటిని తొలగించారు. 50డివిజన్లలో తిరిగి ఎక్కడ నీరు నిలిచిందో అక్కడ ఉండి సహాయక చర్యలు చేపట్టారు. దెయ్యలతూము డ్రైను, జాలిపూడి డ్రైను, పత్తేబాద డ్రైను, పవర్ పేట, వన్‌టౌన్ ప్రాంతాల్లో వర్షపునీటిని తొలగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయిన్లలో వ్యర్థాలు ఎప్పటికప్పుడే శుభ్రం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రెయిన్లు శుభ్రం చేస్తే వర్షపునీరు ఎక్కడా ఆగకుండా వెళ్లిపోతుందన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కావద్దని హెచ్చరించారు. కార్పొరేటర్లు, పారిశుధ్య సిబ్బంది, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి మరిన్ని చర్యలు : చింతమనేని

పెదవేగి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులతో పాటు గ్రామాల మధ్య రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. పెదవేగి మండలం తాళ్లగోకవరం-రామశింగవరం మధ్య ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రహదారిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లగోకవరం నుంచి మండల కేంద్రం పెదవేగికి రావడానికి వేగివాడ మీదుగా దూరం తగ్గుతుందన్నారు. అదే రామశింగవరం మీదుగా వస్తే దూరం తగ్గుతుందని, దీంతో పాటు ఆ ప్రాంతంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రధానంగా ఆయిల్‌పామ్ గెలలను పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ కర్మాగారానికి తీసుకురావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ క్రమంలో రైతులతో మాట్లాడి, రైతుల సొంత భూమి నుంచి రహదారి ఏర్పాటు చేశామని, ఇప్పుడు ఆ రోడ్డు అభివృద్ధికి రూ.1.15కోట్లు నిధులు మంజూరు చేయించినట్టు ఆయన తెలిపారు. అలాగే తాళ్లగోకవరం గ్రామకంఠం నుంచి ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డు వరకు ఉన్న రహదారిని రూ.40 లక్షల అంచనాతో బీటీ రోడ్డుగా మారుస్తున్నామని చెప్పారు. గుండేరువాగుపై వంతెన నిర్మించాల్సి ఉందని, దీని కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురం నుంచి గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక మీదుగా పైడిచింతపాడు వరకు 3.8కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.3.35 కోట్లు నిధులు మంజూరు చేశామని ప్రభాకర్ పేర్కొన్నారు.



గుండేరు వద్ద వరదను పరిశీలిస్తున్న చింతమనేని



ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధిస్తున్న స్వామీజీ

నగరేశ్వరుని సన్నిధిలో శత చండీయాగం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్రహారంలో నగరేశ్వరస్వామి ఆలయంలో కన్యకాపరమేశ్వరి సత్రం వారు ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న అష్టోత్తర శత చండీయాగాన్ని సోమవారం పండితులు భక్తజనంతో శాస్త్రోక్తంగా ప్రారంభించారు.ఈసందర్భంగా శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరిపించారు. పెద్ద సంఖ్యలో ఆర్య వైశ్య సంఘానికి చెందిన ప్రతినిధులు, మహిళలు, కోలాహలంగా పాల్గొని భక్తి శ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. ఆలయ ఈవో నాగబాబు, సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

హైస్కూల్‌కు బెల్ మిషన్ అందజేత

దెందులూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసు కుని బాగా చదువుని అభివృద్ధి చెందాలని దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కొవ్వలి గ్రామానికి చెందిన గ్రేడ్-1 పంచాయతీ ఈవోగా పని చేసిన స్వర్గీయ వడ్లపట్ల మురళీ కృష్ణ జ్ఞాపకార్థం వారి కుమార్తె రూ.11 వేలు విలువ కలిగిన సమయం చూపించే బెల్ కొట్టే మిషన్‌ను హెచ్ఎం విజయ కుమార్‌కు అందజేశారు. టెన్త్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు తన తండ్రి జ్ఞాపకార్థం విజయలక్ష్మీ నగదు బహుమతులు అందించారు.

స్త్రీశక్తి పథకాన్ని వర్తింపజేయండి

కుక్కునూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి పథకం విలీన మండలాలకు వర్తింపజేయాలని కుక్కునూరు జనసేన మండల ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, చల్లా కోటి, సోమవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి విన్నవించారు. స్త్రీశక్తి పథకం రాకముందు రాజమండ్రి నుంచి భద్రాచలానికి ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉండేవి, ఈ పథకం అమలులోకి వచ్చిన తరువాత రాజమండ్రి డిపో నుంచి భద్రాచలానికి అల్ట్రా డిలక్స్ సర్వీస్ బస్సులను నడిపిస్తున్నారు. దీంతో ఈ రెండు మండలాల మహిళలకు స్త్రీశక్తి ఉచిత బస్సు సర్వీస్ పథకం అందడం లేదని ఎమ్మెల్యేకు పలువురు వివరించారు. అల్ట్రా డిలక్స్ బస్సుల వలన మహిళలు టిక్కెట్టు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో ఎమ్మెల్యే చిర్రి బలరాజు స్పందిస్తూ విజయవాడ సౌత్ జోన్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

జూ. కళాశాలలో ఆధార్ సేవలు

పోలవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆధార్ అప్ డేట్, కొత్త ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి మంగళవారం వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని పోస్టాఫీసు సిబ్బంది తెలిపారు. ఆధార్‌లో పేరు, చిరునామా, మొబైల్ నెంబరు తదితర వివరాలు సవరించుకోవడానికి, కొత్త ఆధార్ నమోదు చేసుకోవడానికి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

చిన్నారి వైద్యానికి సాయం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడేనికి చెందిన చిన్నారికి గుండే ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి ఎంపీ మహేశ్ కుమార్ 1.7 లక్షలు మంజూరు చేయించారు. 5నెలల చిన్నారి గుండెలో రంధ్రం ఉందని తల్లిదండ్రులు తెలపగా వెంటనే స్పందించిన ఎంపీ మహేశ్ విజయవాడ రమేశ్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. చిన్నారి తల్లిదండ్రులు ఎంపీ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జీలుగుమిల్లిలో పోలీస్ యాక్టు

జీలుగుమిల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతల దృష్ట్యా 144 సెక్షన్, 30పోలీస్ యాక్టు అమలులో ఉన్నట్లు ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ చెప్పారు. ఎక్కువ మంది వీధుల్లో గుమిగూడటం, ర్యాలీలు, సభలు ఏర్పాటు చేయడం, వ్యక్తి గత దూషణలు, ఘర్షణకు దిగడం, ఐదుగురుకు మించి ఎక్కువ మంది కనిపించడం వంటి చర్యలు పూర్తిగా నిషేధమన్నారు. ప్రజలు శాంతియుతంగా వ్యవ హరించాలని ఈ నెల 30వ తేదీ వరకు యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అసౌకర్యం కల్గినా పోలీస్‌లకు సమాచారమివ్వాలన్నారు.



అదనపు కమిషనర్‌గా బాధ్యతలు

ఏలూరుటూటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు నగర పాలక సంస్థలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఏలూరు అదనపు కమిషనర్‌గా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ భానుప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెండునెలల క్రితం అదనపు కమిషనర్‌గా పని చేస్తూ చంద్రయ్య రిటైర్ అయ్యారు. ఆ స్థానంలో శ్రీనివాసరావు వచ్చారు.

బీసీలకు అండగా ఉండాలి

టి.నర్సాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన విధంగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. ఈ మేరకు టీడీపీ మంగళగిరి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రవి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో బీసీలపై దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీసీలకు అండగా ఉండాలని అన్నారు. బీసీలకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని, ఆ దిశగా చర్యలు చేపడతామని పల్లా హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.



పల్లాకు వినతిపత్రం అందజేస్తున్న రవి

కర్నూలు సభకు 20 బస్సులు కేటాయింపు

ఏలూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈ నెల 16న జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు ఏలూరు జిల్లా నుంచి 20 బస్సులను అక్కడకు పంపనున్నారు. కర్నూలులో స్థానికంగా ప్రజలను తీసుకెళ్లడానికి 9 ఎక్స్‌ప్రెస్, 11 పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులు ఏలూరు నుంచి ఈ నెల 15న ఉదయం బయల్దేరి వెళ్లనున్నాయి.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

ముదినేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వడాలిలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రతినిధులు సోమవారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. సంస్థ ప్రతినిధి జి.స్నేహ, సూపర్‌వైజర్ బదుగు రాజేష్, ఏఎన్ఎం చంద్రిక, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, లింక్ వర్కర్స్ నాగలక్ష్మి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు. వైద్యఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి పలువురికి రక్త పరీక్షలు జరిపారు.


ముదినేపల్లిలో నూతన టీచర్లకు అపాయింట్‌మెంట్లు అందిస్తున్న ఎంఈవో-1 రామారావు, ఎంఈవో-2 నరేష్ కుమార్

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ముదినేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు సోమవారం తమకు కేటాయించిన స్కూళ్లలో విధుల్లో చేరారు. ముదినేపల్లి మండలానికి కొత్తగా 40 మంది ఉపాధ్యాయులు నియామకం పొందారు. మండలంలోని జిల్లా పరిషత్తు హైస్కూళ్లకు 30 మంది, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలకు 10 మంది ఉపాధ్యాయులు నియమితుల య్యారు. నూతనంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు ఎంఈవో-1 డి.రామారావు, ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ సోమవారం స్థానిక మండల రీసోర్స్ సెంటర్‌లో నియామక పత్రాలు అందజేసి, జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చారు.

- **కలిదిండి:** మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 59 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారని ఎంఈవో రామలక్ష్మి తెలిపారు. నూతన టీచర్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించి అభినందనలు తెలిపారు.
- **కైకలూరు :** మండలంలో డీఎస్సీలో నూతనంగా ఎంపికైన 78 మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలో విధుల్లో చేరారు. సోమవారం కైకలూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు జాయినింగ్ పత్రాలను ఎంఈవోలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు అందజేశారు. మండలంలో 78 మందికి 77 మంది విధుల్లో చేరారు. కొల్లేటికోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న ఉపాధ్యాయుడు మాత్రమే విధులకు హాజరు కాలేదు. 25 మంది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, 53 మంది జిల్లా పరిషత్ హైస్కూల్‌ల్లో విధుల్లో చేరారు.
- **మండవల్లి :** మండల విద్యా వనరుల కేంద్రంలో నూతనంగా విధులలో చేరే సెకండ్ గ్రేడ్ టీచర్స్‌కు నియామక పత్రాలను మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ సురేష్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలలో 10 మంది సెకండ్ గ్రేడ్ టీచర్లు చేరారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులకు ఎంఈవో-2 రత్నసునాదం, హెచ్ఎం శ్రీనివాసులు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు.


మండవల్లిలో నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందిస్తున్న ఎంఈవో-2 రత్నసునాదం, హెచ్ఎం శ్రీనివాస్

చాట్రాయి మండలంలో..

చాట్రాయి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు సోమవారం విధుల్లో చేరారు. ముందుగా చాట్రాయి విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో-1 శ్రీనివాస్, ఎంఈవో-2 బ్రహ్మచారిల నుంచి నియామక పత్రాలు తీసుకొని పాఠశాలలకు వెళ్లి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండలానికి ఎస్జీటీ 37, స్కూల్ అసిస్టెంట్ 22 మొత్తం 59 మంది ఉపాధ్యాయులను కేటాయించగా ఎక్కువ శాతం మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో జాయిన్ అయినట్లు అధికారులు తెలిపారు.


చాట్రాయిలో నియామక పత్రం అందుకుంటున్న టీచర్


ముసునూరులో నియామక పత్రాలతో నూతన ఉపాధ్యాయులు

ముసునూరు మండలానికి ఎనిమిది మంది...

ముసునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025లో సెలెక్ట్ అయిన ఎనిమిది మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండల విద్యా కార్యాలయంలో ఎంఈవో-1 పి.సుభాషిని, ఎంఈవో-2 బి.వి.యస్ సుబ్బారావులకు నూతన ఉపాధ్యాయులు నియామక పత్రాలను అందజేశారు. మండల పరిషత్, ప్రాథమిక, ప్రాతమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధుల్లోకి చేరారు. నూతన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఆగిరిపల్లి మండలంలో 12 మంది..

ఆగిరిపల్లి, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 12 మంది కొత్త ఉపాధ్యాయుల విధుల్లో చేరారని ఆగిరిపల్లి ఎంఈవోలు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్ తెలిపారు. ఎస్జీటి ఒక్కరు, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ నలుగురు,ఇంగ్లీషు ఒకరు, బయాలజీ ఇద్దరు, ఫిజిక్స్ ఒకరు, సోషల్ స్టడీస్ ఒకరు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒక్కరు, క్లస్టర్ ఎస్జిటి ఒక్కరికి సోమవారం నియామక పత్రాలు అందజేశారు.


ఆగిరిపల్లి హైస్కూల్‌లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

అయ్యప్పల అన్నసమారాధనకు వంట పాత్రలు వితరణ

చాట్రాయి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం శివాలయంలో 40 రోజుల పాటు జరిగే అయ్యప్ప దీక్షాదారులు అన్నసమారాధనకు చాగంటి పాపయ్య మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం రూ.40 వేలు విలువైన వంట పాత్రలు అందజేశారు.ట్రస్ట్ సభ్యులు చాగంటి నరశింహారావు, శ్రీనివాసరావు, వాసుదేవ రావు, అర్చకులు కృష్ణమాచార్యులు, అయ్యప్ప గురుస్వామి శ్రీను పాల్గొన్నారు.




కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో చేరిన వర్షపు నీరు


కలిదిండి బస్టాండ్ వద్ద వర్షపునీటితో మునిగిన రహదారి


వర్షాలకు ధ్వంసమైన ముదినేపల్లి - గుడ్లవల్లేరు ఆర్అండ్‌బీ రోడ్డు

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/చాట్రాయి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. సోమవారం ఉదయం 5 గంటల నుండి ఎడతెరిపి లేకుండా 12 గంటల వరకు కుండపోత వాన జనజీవనం అస్తవ్యస్తంగా మారడమే కాక, ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎక్కడిక్కడే డ్రెయిన్‌లు పొంగి రహదారులను ముంచేశాయి. దీంతో ర దారులు కాల్వలను తలపించాయి. కైకలూరు తాలూకా సముదాయంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయానికి వర్షపు నీరు చేరింది. మండల పరిషత్ కార్యాలయంలోనికి, సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వర్షపు నీరు చేరింది. ఆ నీటిలోనే అధికారులు విధులు నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి ఎండీవో కార్యాలయం వెనుక ఉన్న మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లే ఉపాధ్యాయులు అందరూ నీటిలోనే ప్రయాణించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. మండలంలోని రాచపట్నం నుంచి శీతనపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి నీట మునిగింది. భారీ వర్షాలతో విద్యార్థులు అవస్థలకు గురయ్యారు. భారీ వర్షాలతో చేపల, రొయ్యల రైతులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చెరువులు నిండిపోవడంతో ఎక్కడికక్కడే బయటకు వెళ్లే విధంగా విద్యుత్‌మోటార్లను, ఆయిల్ ఇంజన్‌లను అమర్చి నీటిని బయటకు తోడారు. వాతావరణం పూర్తిగా చల్లదనంగా మారిపోవడంతో ఆక్వా రైతులు ఆక్సిజన్ లేకుండా మందులను ముందస్తుగా పిచికారీ చేశారు.

- కలిదిండిలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కుండపోతగా భారీ వర్షం కురిసింది. బస్టాండ్ వద్ద ప్రధాన రహదారి కిలోమీటర్ మేర నీటమునగడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతా లైన ఇందిరా కాలనీ, ఆదర్శనగర్, దేవుడు తోట నీటమునిగాయి. లంక గ్రామాలైన మూల్లంక, పెదలంక, మట్టగుంట రహదారులపై పడిన గుంతలు నీటితో నిండటంతో చెరువులను తలపిస్తున్నాయి. చేపల చెరువులు వర్షపు నీటితో నిండిపోవటంతో చెరువుల్లో నీటిని బయటకు మోటారు పంపులతో తోడుతున్నారు.
- ముదినేపల్లి - గుడ్లవల్లేరు ఆర్అండ్‌బీ రోడ్డు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ధ్వంసమైంది. వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది.
- చాట్రాయి మండలంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సుమారు గంటపైగా కుండపోత వర్షం పడటంతో జనజీవనం నిలిచిపోయింది. రోడ్ల గోతులు కన్పించకుండా వర్షం నీరు నిలవటంతో ఎటువెళ్ళాలో తెలియక వాహనచోదకులు అవస్థలు పడ్డారు.


రాచపట్నం- సీతనపల్లి నీట మునిగి కాల్వను తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి


కైకలూరు సబ్‌ట్రెజరీ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీరు

కుండపోత

(5వ పేజీ తరువాయి)

91.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 33.4 మి.మీ నమోదైంది. లింగపాలెం 81.8, బుట్టాయిగూడెం 67, కలిదిండి 46.2, పెదవేగి 58.8, ఏలూరు రూరల్ 44.6, కైకలూరు 41.2, నిడమర్రు 39, ఏలూరు అర్బన్ 37.6, చింతలపూడి 31.2 జీలుగుమిల్లి 31, ఉంగుటూరు 29.4, ముదినేపల్లి 34.2, దెందులూరు 39, కామవరపుకోట 30.2, నూజివీడు 26.6, భీమడోలు 23.2, జంగారెడ్డిగూడెం 28.8, ముసునూరు 28.6, వేలేరుపాడు 20, పోలవరం 19.2, చాట్రాయి 17.4, ఆగిరిపల్లి 15.8టి నరసాపురం 14, ద్వారకాతిరుమల 12.8, మండవల్లి 10.4, కుక్కునూరు 9.4, పెదపాడు 7.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఆరెంజ్ అలర్ట్ జారీ

జిల్లాలో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు ఆరంజ్ అలర్ట్ జారీ చేయడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ కామినేని పట్టాభి

జడ్పీ హైస్కూల్‌లో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు ప్రారంభం

కలిదిండి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో దాతల సహకారంతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్స్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కామినేని పట్టాభి సోమవారం ప్రారంభించారు. హెచ్ఎం అనిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్‌లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కొండా లక్ష్మణరావు, వైస్ చైర్మన్ టి.శిరీష, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


మందుగుండు దుకాణాల సముదాయాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ రవికుమార్

మందుగుండు దుకాణాల సముదాయం పరిశీలన

కైకలూరు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కైకలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసే మందుగుండు సామాన్ల దుకాణాలను ఏర్పాటుకు స్థలాన్ని రూరల్ సీఐ వి.రవికుమార్ పరిశీలించారు. దుకాణాల ఏర్పాటు చేసే యాజమానులతో కలిసి స్థల పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. దుకాణాల మధ్య రెండు మీటర్ల ఖాళీ ఉంచాలని ప్రతి చోట డ్రమ్ములతో నీరు ఏర్పాటు చేయాలని సూచించారు. టౌన్ ఎస్సై ఆర్.శ్రీను, ఆర్ఐబీ వెంకటేశ్వరరావు, అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్‌కు బస్సు

చాట్రాయి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దున ఉన్న మండలంలోని కృష్ణారావుపాలెం నుంచి మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌కు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును సోమవారం ఉదయం చనుబండలో పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు, మండల టీడీపీ నాయకుడు నక్కా రాము ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు అట్టహాసంగా ప్రారంభోత్సం జరిపారు. బస్సు చనుబండ రాగానే మామిడి తోరణాలు కట్టి, పూల దండలో అలంకరించి, నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటానికి కూటమి నాయకులు మహిళలు పాలాభిషేకం చేశారు. చనుబండ, సూరంపాలెం, కృష్ణారావుపాలెం తదితర గ్రామాలకు ఆంధ్ర బస్సులు లేకపోవటంతో స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకోలేక పోతున్న విషయాన్ని ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టి తీసువెళ్ళామన్నారు. వెంటనే స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేయించిన మంత్రి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. ఎయిమ్స్‌కే కాకుండా విస్సన్నపేట, నూజివీడు, విజయవాడ పట్టణాలకు, పుణ్య క్షేత్రాలకు వెళ్ళే ప్రయాణికులకు ఈ బస్సు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. పరసా శ్రీను, నెక్కలపు వెంకటేశ్వర రావు, గవర వెంకటేశ్వరరావు, బన్నే వీరయ్య, వీరాస్వామి, బ్రహ్మయ్య, తేనేటి వేణు తదితరులు పాల్గొన్నారు.


చనుబండలో బస్సు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

అప్రమత్తంగా ఉండండి : మంత్రి పార్థసారథి

నూజివీడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, అధికారులను ఆదేశించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తర లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ తాగునీటి సమస్య తలెత్తకుండా ఆయాశాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు.

జూదరుల అరెస్ట్

నూజివీడు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం దేవర గుంట గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు చేసిన నూజివీడు రూరల్ పోలీసులు 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. దేవరగుంట శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామని వారివద్ద నుంచి 46,450 నగదు స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు రూరల్ ఎస్సై జ్యోతిబసు తెలిపారు.

3 నుంచి మునిసిపల్ కార్మికుల సమ్మె

తణుకు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్క రించాని కోరుతూ వచ్చేనెల 3 నుంచి సమ్మెకు సమాయ త్తమవుతున్నారు. ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు ఈ వివరాలు వెల్లడించారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరిణించిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

తాడేపల్లిగూడెంరూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో భార్య మందలించిందని మస్తాపంతో ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వి వరాల ప్రకారం.. మోదుగగుంటకు చెందిన దండ్రు వెంకట్రావు(50) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12న మధ్యా హ్నం మద్యం మత్తులో ఇంటి వద్ద ఇష్టం వచ్చి నట్టు ప్రవర్తించడంతో భార్య మందలించింది. దీంతో ఇంటికి ఎదురుగా ఉన్న పంట చేల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు తా డేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు దండ్రు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఎండీ జిలాని తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

కుక్కునూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు గ్రామ శివారులోని రామాలయం వద్ద సోమవారం ఉదయం ఓకారు ప్రమాద వ శాత్తు రహదారి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న రాజమండ్రికి చెందిన జాన్ షడక్, రాణి దంపతులు తెలంగాణ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పల్టీ కొట్టిన కారు నుంచి వారిని స్థానికులు బయట కు తీశారు. చిన్నచిన్న గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకు తీశారు. రాజమండ్రి నుంచి తెలంగాణలోని చర్ల వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.



అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఒక వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఏలూరు కత్తేపు వీధికి చెందిన పుప్పాల పవన్‌కుమార్(40) లారీల ట్రాన్స్‌పోర్టు వ్యా పారం చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈనెల 11న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అందడంతో ఎస్ఐ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లోని వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 3 నుంచి తలపెట్టిన కార్మికుల సమ్మెకు సంబంధించి నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డికి సోమవారం కార్మికులు సమ్మె నోటీసు అందించారు. పుల్లారావు మాట్లాడుతూ మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్ ఆఫ్ నేచర్‌ను బట్టి ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచి చెల్లింపులు చేపట్టాలన్నారు. మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్, అల్లం కనకదుర్గ, పృథ్వీరాజ్, ముత్యాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణసంచా కాల్చే సందర్భాల్లో పర్యావరణ పరిరక్షణ వ్యక్తిగత భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజరాణి సూచించారు. కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. కళ్ళకు పొగ తగలకుండా చూసుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో కంటికి గాయం అయితే నలపకూడదన్నారు. గాయాలైతే తక్షణం ఆసుపత్రికి తరలించి తగిన వైద్య సేవలు పొందాలన్నారు.



నకిలీ మద్యాన్ని అరికట్టాలి

నూజివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మద్యం విక్రయాలు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లి నకిలీ మద్యం ఏరులై పారుతోందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు విమర్శించారు.నకిలీ మద్యంపై వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నూజివీడు ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్యకు వినతిపత్రం అందించారు.

ముసునూరు బాలికల హాస్టల్‌లో వసతులు ఓకే..

ఆంధ్రజ్యోతి విజిట్

ముసునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సుమారు 80 మంది బాలికలు ఉన్నారు. ఇక్కడ కొన్ని సౌకర్యాలు బాగానే ఉన్నాయి. బాలికలకు కాస్మోటిక్ చార్జీలు నాలుగు నెలలుగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనానికి రంగులు వేసి సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో అక్కడక్కడ పాకుడుపట్టి పాత భవనంగా దర్శినమిస్తోంది.ఇటీవల మరుగుదొడ్లను మరమత్తులు చేయడంతో శుభ్రంగా ఉన్నాయి. దాతల సహకారంతో హాస్టల్‌కు ఆర్వో మినరల్ ప్లాంట్ సమకూరడంతో తాగునీటి ఇబ్బందులు తొలిగాయి. మోనూ ప్రకారం బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. హాస్టల్‌కు నైట్‌వాచ్ మెన్ ఉండటంతో రక్షణకు ఇబ్బంది లేదు. హాస్టల్ ప్రాంగణంలో కూరగాయలు, ఇతర ఆకుకూరలను పండిస్తున్నారు.